

26న నరసాపురంలో కొబ్బరి రైతుల ధర్నా

ప్రజాశక్తి - పాలకొల్లు

కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఈ నెల 26న నరసాపురం సబ్ కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా, జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ పిలుపునిచ్చారు. గురువారం పాలకొల్లు మహిళా సంఘం భవనంలో కొబ్బరి రైతుల జిల్లా సదస్సు, ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా హరేరామ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతుల సంఘం నేతలు తూటే మార్టిన్ లూథర్, యర్రా అజయ్ కుమార్, చోడదాసి అగస్టిన్, ఎస్.పురుషోత్తం, చల్లా సోమేశ్వరరావు, ఎం.త్రిమూర్తులు, తిరుమని నాగరాజు పాల్గొన్నారు.

- ధాన్యం కొనుగోలు సమస్యలను ముందే పరిష్కరించాలంటున్న రైతులు
- తేమ, తూకం పేరుతో మిల్లర్ల దోపిడీని అరికట్టాలని ఆవేదన
- మిల్లుల్లో అన్‌లోడింగ్ ఆలస్యంతో రైతులపై అదనపు ఛార్జీల భారం
- లారీలు, సంచుల ఏర్పాటుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి
- గత రబీలో ఎదురైన సమస్యలపై దృష్టి సారించాలంటున్న అన్నదాత

ప్రతియేటా ధాన్యం కొనుగోళ్లపై పాలకులు, అధికారులు చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో పరిస్థితికి ఏ మాత్రం సంబంధం ఉండటం లేదు. ధాన్యం కొనుగోళ్లపై ముందస్తు సమావేశాల పేరుతో హడావుడి చేయడం తప్ప సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ధాన్యం కొనుగోలులో మిల్లర్ల సమస్యలే ప్రధానమని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వీటికితోడు లారీలు లేక రవాణా ఇబ్బందులు, సంచుల కొరత వరి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. గడిచిన రబీలో ధాన్యం కొనుగోలులో రైతులు పడ్డ ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఈ ఖరీఫ్ సీజన్‌లోనైనా సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలుపై ముందుగానే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మిల్లర్లే సమస్య..!



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు అక్టోబర్ నెలాఖరు నుంచి ప్రారంభించనున్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ముందస్తు సమావేశాలు సైతం నిర్వహిస్తున్నారు. అయితే రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై మాత్రం స్పష్టత ఇవ్వని పరిస్థితి ఉంది. అంతకుముందుగాని, గడిచిన రబీలోగాని ధాన్యం కొనుగోలులో రైతులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతమని చెప్పొచ్చు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి మిల్లర్లే ప్రధాన సమస్యగా మారారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రస్తుత ఖరీఫ్‌లో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు అంచనా వేస్తున్నారు. అయితే ధాన్యం కొనుగోలుకు సంబంధించి మాత్రం ఇప్పటి నుంచే తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రైతుభరోసా కేంద్రాల్లో తేమశాతం, వేబ్రిడ్జి తూకం పరిశీలన జరిగిన తర్వాత అధికారుల ఆధ్వర్యంలోనే రైతులు మిల్లులకు ధాన్యం తరలిస్తున్నారు. తీరా ధాన్యం మిల్లులకు చేరిన తర్వాత అక్కడ మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. తేమశాతం ఎక్కువగా ఉందంటూ ధాన్యం దిగుమతి చేయకుండా నిలుపుదల చేస్తున్నారు. తేమశాతాన్ని బట్టి రైతుల నుంచి సొమ్ము వసూలు చేస్తున్నారు. వేబ్రిడ్జి కాటా వేసిన తర్వాత కూడా తూకంలో తేడా ఉందంటూ మళ్లీ సొమ్ము వసూళ్లు జరుగుతున్నాయి. రైతుల నుంచి వసూలు చేస్తున్న సొమ్మును ఫోన్‌పే ద్వారా తీసుకుంటున్నారు. సొమ్ము చెల్లించకపోతే ధాన్యం దిగుమతి చేసుకోవడం లేదు. ఇదంతా బహిరంగంగానే జరుగుతోంది. అయినప్పటికీ రైతులకు న్యాయం జరగని పరిస్థితి ఉంది. రబీ సీజన్‌లో చాలామంది రైతులు రూ.15 వేల నుంచి రూ.22 వేల వరకూ మిల్లర్లకు చెల్లించిన పరిస్థితి ఉంది. రైతుభరోసా కేంద్రంలో తేమ, తూకం పరిశీలించి అంతా బాగుందని పంపిన తర్వాత మిల్లర్లు సొమ్ము వసూలు చేయడంపై ప్రభుత్వం కచ్చితమైన చర్యలు తీసుకోవడం లేదు. రైతుల నుంచి సొమ్ము వసూలు చేస్తే మిల్లులు సీజ్ చేస్తామని ప్రకటనలు గుప్పించడంతోనే సరిపోతుంది. సొమ్ము వసూలు చేసిన మిల్లర్ల నుంచి తిరిగి రైతులకు సొమ్ములు ఇప్పించడం వంటి చర్యలు ఎక్కడా జరగలేదు. తేమ, తూకం విషయంలో ఎందుకు తేడాలు చూపిస్తున్నారో స్పష్టమైన ఆధారాలు సైతం చెప్పడం లేదు. తేమ, తూకం విషయంలో రైతుభరోసా కేంద్రాల అధికారుల నిర్ణయమే అంతిమంగా ప్రభుత్వం ప్రకటించాలి. ఒక్కసారి రైతుభరోసా కేంద్ర అధికారులు అన్నీ సవ్యంగా ఉన్నాయని పంపించిన తర్వాత కూడా మిల్లర్లు సొమ్ము వసూలు చేస్తే ఎటువంటి చర్యలు తీసుకుంటారో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు కోరుతున్నారు. మిల్లర్లకు తేమ, తూకం నిమిత్తం ఎటువంటి సొమ్మూ చెల్లించనక్కర్లేదని అధికారులు రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోకుండా ఆలస్యం చేయడంతో అధికంగా రవాణా ఛార్జీల భారం రైతులపై పడుతోంది. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

లారీలు, సంచుల సమస్య తీరేనా

ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెడుతున్న మరో సమస్య రవాణాకు సంబంధించి లారీలు, సంచుల సమస్యలు. ఏలూరు జిల్లాలో ప్రధానంగా ఈ సమస్య అత్యధికంగా ఉంటుంది. మాసూళ్లయిన తర్వాత లారీలు ఏర్పాటు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. దీంతో రైతులే పెద్దమొత్తంలో కిరాయిలు చెల్లించి లారీలు పెట్టుకోవాల్సిన దుస్థితి ఉంటుంది. లారీలు లేక మాసూలు చేశాక 15 రోజులకుపైగా ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోతున్న పరిస్థితీ ఉంది. సంచులు సరిపడా ఇవ్వకపోవడం, చిరిగిన సంచులు ఇవ్వడం వంటి సమస్యలతో రైతులు నలిగిపోతున్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. లేకపోతే అధికారులు ఎన్ని సమావేశాలు పెట్టినా రైతులకు ఎటువంటి ప్రయోజనమూ ఉండదని చెప్పొచ్చు.



మాట్లాడుతున్న మాల్యాద్రి

రాజ్యాంగ పరిరక్షణకు పోరుబాట

- అసైన్డ్ భూముల చట్ట సవరణను విరమించుకోవాలి
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి
- వ్యకాస, కెవిపిఎస్ దళిత రక్షణ యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం

బిజెపి పాలనలో రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ హక్కులు హరిస్తున్నారని, రాజ్యాంగ పరిరక్షణకు ఇక పోరుబాట తప్పదని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. అసైన్డ్ భూముల చట్ట సవరణను తక్షణం విరమించుకోవాలని, లేనిపక్షంలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లాస్థాయి దళిత రక్షణ యాత్రను గురువారం స్థానికంగా నీలి పతాకాన్ని ఊపి మాల్యాద్రి ప్రారంభించారు. తొలుత అంబేద్కర్ చౌక్‌లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి మాల్యాద్రి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి మాల్యాద్రి మాట్లాడుతూ దళితులకు రక్షణగా ఉన్న చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని మోడీపై మండిపడ్డారు. మోడీ గద్దెనెక్కగానే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని చట్టంలో మార్పులు తెచ్చారని తెలిపారు. దేశవ్యాప్తంగా దళితులందరూ ఐక్యంగా పోరాడటంతో వెనకడుగు వేశారని గుర్తు చేశారు. అబద్దాలతో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రజలను పూర్తిగా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా దళితులపై దాడులు మరింతగా పెరిగాయన్నారు. రాష్ట్రంలో ఆధిపత్య కులాల దురహంకారంతో హత్యలు, అత్యాచారాలు పెరగడం శోచనీయమన్నారు. దళితులకు ఉన్న 27 సంక్షేమ పథకాలను నిలిపివేయడం అన్యాయమని విమర్శించారు. దళితులపై దాడులను అరికట్టకుండా ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టప్రకారం నమోదైన కేసుల్లో 41 సిఆర్‌పిసి ప్రకారం స్టేషన్ బెయిల్ ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలకు అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లు పూర్తి చేసుకున్నా దేశంలో నేటికీ దళితులపై కుల వివక్ష, అంటరానితనం ఉండటం దారుణమన్నారు. కుల వ్యవస్థ నిర్మూలించాల్సిన పాలకులు అదే కుల వ్యవస్థను పెంచి పోషిస్తున్నారన్నారు. ఒకవైపు మహిళల పట్ల వివక్ష చూపుతున్న బిజెపి ప్రభుత్వం మరోవైపు మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో మోసం చేస్తుందని విమర్శించారు. పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.వాసు, పట్టణ కార్యదర్శి ప్రసాద్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.చైతన్యప్రసాద్, షేక్ వలీ, దళిత నాయకులు మీసాల జయరాజు యాత్రకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, నాయకులు రంగ, రాఘవులు, అత్రియ్య, సూర్యచంద్రరావు, వెంకటలక్ష్మి, బాతు రామస్వామి, కింతాడ రమేష్, మువ్వల రాజారావు, రాజు, మాదాసు గోపి పాల్గొన్నారు.

ఉండి: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దళిత రక్షణ యాత్ర మండల కేంద్రం ఉండి చేరుకుంది. యాత్ర బృందానికి కెవిపిఎస్, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనస్వాగతం పలికారు. తొలుత ఎన్ఆర్‌పి అగ్రహారం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు కె.క్రాంతిబాబు, జక్కంశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉండి సెంటర్లో కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి అధ్యక్షతన జరిగిన సభలో దళ నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండలాధ్యక్షులు కింతాడ రమేష్, సిఐటియు నాయకులు ధనికొండ శ్రీనివాస్, ఖండవల్లి వెంకన్న, వెంకటేశ్వరరావు, ప్రశాంత్, రామయ్య, కాసులు, లక్ష్మణరావు, చిట్టిబాబు, రాంబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆకివీడు: దళితుల చేతుల్లో ఉన్న భూములను లాక్కోవడానికే అసైన్డ్ భూముల చట్టసవరణ చేశారా అని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కెవిపిఎస్, వ్యకాస ఆధ్వర్యాన చేపట్టిన దళిత రక్షణ యాత్ర గురువారం ఆకివీడు చేరుకుంది. ఈ సందర్భంగా నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభలో క్రాంతిబాబు మాట్లాడారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రాంతిబాబు మాట్లాడారు. దళితపేటల అభివృద్ధికి పోరాడి సాధించుకున్న ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మిగులు భూములను దళితులకు తక్షణమే పంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.తవిటినాయుడు, బివి.వర్మ, డివైఎఫ్ఐ నాయకులు రాంబాబు, సందక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: దళిత రక్షణ యాత్ర ఈ నెల 23న మండలానికి రానుందని కెవిపిఎస్ నాయకులు పిట్ల కృపారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కండెల్లి సోమరాజు తెలిపారు. కొత్తూరు శివారు ఇందిరానగర్ దళితపేటలో దళితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి పంపే వినతిపత్రంపై సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో దేపల్లి దొరబాబు, దాసరి చిన్న, అలమండ సాయి, అలమండ ఆంజనేయులు, పెట్ల రామరాజు, లంక భాను, ఎల్.సీనమ్మ, నాగమణి, మారంపూడి అనితకుమారి, లంక రమణ, అలమండ బాలకృష్ణ పాల్గొన్నారు.

పెనుగొండ: దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయాలని సిద్ధాంతం దళితపేటలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యకాస నేత షేక్ పాదూసా మాట్లాడగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓట్ ఫర్ ఓపిఎస్‌నే మా నినాదం



వీరవాసరంలో నిరసన

ప్రజాశక్తి - వీరవాసరం

జిపిఎస్ పేరుతో మోసగిస్తే ఓట్ ఫర్ ఒపిఎస్ నినాదంతో ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని సిపిఎస్ ఉద్యోగులు హెచ్చరించారు. స్థానిక తూర్పుచెరువు సెంటర్‌లో సిపిఎస్ ఉద్యోగులు గురువారం జిపిఎస్‌కు వ్యతిరేకంగా గళమెత్తారు. జిపిఎస్‌ను బలవంతంగా అమలు చేయాలని చూస్తే ప్రతిఘటన తప్పదని ఎపి సిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేత కరక సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒపిఎస్ అమలు చేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చి ఇప్పుడు మాట మార్చడం తగదన్నారు. రాజస్థాన్, చత్తీస్‌గఢ్, జార్కండ్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, కర్ణాటక, సిక్కింలలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ఒపిఎస్ అమలునే అందరికీ ఆమోదయోగ్యమన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత కనీసం తాను దాచుకున్న డబ్బు కూడా ఇవ్వకుండా ఒట్టి చేతులతో పంపే బిల్లే జిపిఎస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు అధ్యక్షుడు శ్రీనివాసు, యుటిఎఫ్ అధ్యక్షుడు జి.వెంకట రమణ, వెంకటేశ్వరస్వామి, దుర్గారావు, రాజమణి, అర్చన పాల్గొన్నారు.

పెనుమంట్ర: జిపిఎస్‌కు వ్యతిరేకంగా ఉపాధ్యాయులు స్థానిక బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. దీనికి అంగన్వాడీలు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేత సాయిరెడ్డి, ఎపిటిఎఫ్ నేత రాంబాబు, ఆచార్యులు మాట్లాడారు. కార్యక్రమంలో విజయకుమారి, చీపురుపల్లి శ్రీనివాస్, రామభద్రం, గూడూరు శ్రీనివాస్, ఎస్.రామకృష్ణ, సాయి తులసి, విజయకుమారి, సిపిఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరసనల్లో సిపిఎస్ ఉద్యోగులు స్పష్టీకరణ

జిపిఎస్‌ను ఒప్పుకోం

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గ సమావేశంలో జిపిఎస్ బిల్లును ఆమోదించడాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి తీవ్రంగా ఖండించారు. దీనికి నిరసనగా నలుపు దుస్తులు ధరించి గోపీమూర్తి గురువారం విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడారు. జిపిఎస్ అనేది సిపిఎస్‌కు మరో రూపమే తప్ప ప్రత్యామ్నాయం కాదని, ఆ మాటకొస్తే సిపిఎస్ కంటే ప్రమాదకరమైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సిపిఎస్ ఉద్యోగుల అభిప్రా యాలు తెలుసుకోవడానికి సర్వే నిర్వహించాలన్నారు. ఒపిఎస్ అమలు చేయకుండా జిపిఎస్ కోసం ప్రభుత్వం ముందుకెళ్తే రానున్న కాలంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సాంఘిక దురాచారాలకు ఎదురొడ్డిన గురజాడ

ప్రజాశక్తి - నరసాపురం

మహిళల కోసం ఎన్నో సాంఘిక దురాచారాలను మహాకవి గురజాడ అప్పారావు ఎదిరించారని, బాల్య వివాహాల రద్దు, వితంతు పునర్వివాహాల కోసం ఎన్నో పోరాటాలు చేశారని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ అన్నారు. స్థానిక కొత్తపల్లి సుబ్బారాయుడు హైస్కూల్లో గురజాడ 160వ జయంతి సందర్భంగా ఐద్వా ఆధ్వర్యాన సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ గురజాడ కన్యాశుల్కం, పుత్తడిబొమ్మ, పూర్ణమ్మ అనే ఎన్నో కొత్త రచనలు చేసి ఇప్పటికీ మనలో సజీవులుగా నిలిచారని అన్నారు. అలాంటి సంఘ సంస్కర్తను ప్రతి మహిళా గుర్తుంచుకోవాలన్నారు. ఆధునిక మహిళ సమాజాన్ని మార్చి తీరుతుందని ఆయన చెప్పారని, ఆ దిశగా బాలబాలికలందరూ ముందడుగు వేయాలని అన్నారు. ప్రస్తుతం మహిళలపై దాడులు, హింసలు పెరిగిపోతున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. దీనిపై పోరాటానికి మహిళలంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. గురజాడకు నివాళులర్పించి ఆయన రచించిన దేశభక్తి గీతాన్ని పిల్లలందరూ ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



తణుకులో గురజాడ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీతారామయ్య

పెనుమంట్ర: గురజాడ జయంతి పొలమూరు హైస్కూల్‌లో ఐద్వా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ మాట్లాడుతూ నాడు సమాజంలో మహిళలు, ప్రధానంగా బాలికలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కష్టాలను పరిశీలించి రచనలు చేసి సమాజాన్ని జాగృతం చేసిన మహాకవి గురజాడ అని కొనియాడారు. వాడుక భాష ప్రయోజనాలను నాటకం, కవిత్వం, కథల రచనల్లో అమలు చేసి తనకు తానే సాటి అని గురజాడ చాటిచెప్పారన్నారు. మహిళలను గౌరవించడం, తోటి మనుషులను ప్రేమించడం, శ్రమను గౌరవించడం, కులమతాలకు దూరంగా మసలడంలో వెలుగుదారి గురజాడ అని అన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం సరస్వతి గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా నేతలు వల్లెం హేమలత, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని పాఠశాలలో ఆరోగ్య వర్షిని వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో అప్పారావు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఆ సంస్థ కార్యదర్శి నాయుడు రాంబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.చక్రవర్తి, కొడాలి తాతారావు బొక్కా కోటేశ్వరి పాల్గొన్నారు.

యలమంచిలి: ఐద్వా ఆధ్వర్యంలో చించినాడ హైస్కూల్‌లో విద్యార్థుల గురజాడ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకులు సరిపల్లి జయప్రభ, మండల అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి సుగుణ, జిల్లెల్ల ప్రశాంతి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణపవరం: సంఘసంస్కర్త గురజాడ అప్పారావు జీవితం నేటి యువతరానికి ఆదర్శనీయమని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ నిర్మలకుమారి అన్నారు. గురజాడ జయంతి సందర్భంగా నిర్వహించిన సభకు ఆమె అధ్యక్షత వహించారు. పుత్తడిబొమ్మ, పూర్ణమ్మ, శిల్ప సౌందర్యాన్ని విద్యార్థులకు వివరించారు. గురజాడ అప్పారావు రచనలు నేటి యువతరం అధ్యయనం చేయాలన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, జి.వెంకట్రావు, సిహెచ్.చైతన్య, కెవి.గణేష్‌కుమార్, బాల మణికంఠ వెంకన్న బాబు, స్వాతి పాల్గొన్నారు.

తణుకు రూరల్: 'దేశమును ప్రేమించుమన్నా అనే మాటలతో ప్రారంభమయ్యే దేశ భక్తి గేయం, దేశ ప్రజలందరి ఆదర్శ గేయం కావాలని శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్ర బాధ్యులు డి.దక్షిణామూర్తి అన్నారు. కులమత భేదాలు వీడి ఏ ప్రాంతం వారైనా మనందరం మనుషులనే సంగతిని గుర్తు పెట్టుకొని మెలగమని గురజాడ తెలిపారన్నారు. సంఘ సంస్కరణాభిలాషి గురజాడ బాటలో నడవాలన్నారు. గురువారం స్థానిక శ్రీశ్రీ విజ్ఞాన సేవా కేంద్ర కార్యాలయంలో గురజాడ జయంతి నిర్వహించారు. విజ్ఞాన కేంద్ర ట్రస్ట్ సభ్యులు సీతారామయ్య గురజాడ చిత్రపటానికి పూలమాల వేయగా, సభ్యులు పిఎల్.నరసింహారావు, అజయకుమారి, గోపీ పాల్గొన్నారు. పట్టణంలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో గురజాడ జయంతి నిర్వహించి, 'దేశమును ప్రేమించుమన్నా' గేయాన్ని విద్యార్థులతో పాడించారు. శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ కోర్సు (మహిళలకు) కంప్యూటర్ కోర్స్, ప్రతి ఆదివారం ఉచిత న్యాయ సలహా కేంద్రం, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని శ్రీ శ్రీ సేవా విజ్ఞాన కేంద్ర ట్రస్ట్ సభ్యులు పిఎల్.నరసింహారావు తెలిపారు.

జిల్లాలో ఘనంగా జయంత్యుత్సవాలు



పెనుమంట్ర: పొలమూరులో మాట్లాడుతున్న కేతా పద్మజ



నరసాపురంలో మాట్లాడుతున్న పూర్ణ

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా రిటర్నింగ్ అధికారులు శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం పాలకొల్లు మండలం కొత్తపేట పంచాయతీ పెంకుళ్లపాడు, పురపాలక సంఘ పరిధిలోని 20వ వార్డు ఎస్‌సి కాలనీ పాఠశాలలో పోలింగు కేంద్రాలను ఆమె పరిశీలించారు. గదులు, విద్యుత్, తలుపులు, కిటికీలు, మరుగుదొడ్లు, ర్యాంపులు, పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు కిలోమీటర్ల పరిధిలోనే పోలింగ్ కేంద్రం కచ్చితంగా ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పూర్తి సదుపాయాలు కల్పించి, వికలాంగులకు ర్యాంపు ఏర్పాట్లను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కలెక్టర్ వెంట పాలకొల్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కెసిహెచ్.అప్పారావు, తహశీల్దార్ సిహెచ్.పెద్దిరాజు, మున్సిపల్ కమిషనర్ బిఆర్ఎస్.శేషాద్రి, టిపిఒ వీరబ్రహ్మం, డిప్యూటీ తహశీల్దార్ వి.బ్రహ్మాజీ పాల్గొన్నారు.



నరసాపురం మండలంలో కలెక్టర్ ప్రశాంతి పరిశీలన

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం నార్త్‌లో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిబంధనలు విరుద్ధంగా పనులు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. చేర్పులు, మార్పులు, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించడంతోపాటు, స్థానిక ప్రజల విజ్ఞాపనలను కూడా పరిగణనలోకి తప్పక తీసుకోవాలన్నారు. ఆమె వెంట తహశీల్దార్ జి.అనితకుమారి, అధికారులు ఉన్నారు.

తాడేపల్లిగూడెం: పట్టణ పరిధిలో ఎల్.అగ్రహారం, సుబ్బారావుపేట, కుంచనపల్లి, పెంటపాడు మండలం రావిపాడులోని పోలింగ్ కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు వంటివి ఉంటే వెంటనే ప్రతిపాదనలు పంపించాలన్నారు. అనంతరం తాడేపల్లిగూడెం పట్టణంలోని సుబ్బారావుపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం గురించి ఆరా తీశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు వంటలు తయారు చేసి పెట్టాలని నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట తాడేపల్లిగూడెం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.దుర్గేష్, తహశీల్దార్ దుర్గాకిషోర్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: పోలింగ్ కేంద్రాల స్థితిగతులపై నివేదిక అందజేయాలని రిటర్నింగ్ అధికారిని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. నరసాపురం మండలం పసలదీవి, లక్ష్మణేశ్వరం, పురపాలక సంఘ పరిధిలో ఏడో వార్డు శివాలయం వీధి పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, తహశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ కెపి.నాగదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాళ్లలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - కాళ్ల

ఈ నెల 22న కాళ్లలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం పది గంటల నుంచి కాళ్ల ఎంపిడిఒ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతిభా విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

విద్యార్థులు ఇష్టంతో చదివితే ఏదైనా సాధించొచ్చని జనసేన నాయకులు నిప్పులేటి తారక రామారావు అన్నారు. గురువారం మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 2022 - 23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని చాగంటి ఉమా నాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, జనసేన నేత చాగంటి మురళీకృష్ణ (చిన్న) సమకూర్చిన నగదును ప్రథమ స్థానంలో నిలిచిన పిప్పళ్ల జీవన నాగశ్రీకి రూ.2,500, ద్వితీయ స్థానంలో నిలిచిన వేంద్ర కుమార్ వెంకట్‌కు రూ.1,500, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో ముక్కు గిరి, నంబుల నాగబాబు, నల్లం సురేష్, ప్రధానోపాధ్యాయులు వర్ధమని రవి శంకర్ పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర


మాట్లాడుతున్న ఐసిడిఎస్ సిడిపిఒ కృష్ణకుమారి

పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతలకు అనారోగ్య సమస్యలు ఉండవని ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.కృష్ణకుమారి తెలిపారు. గురువారం పెనుమంట్ర పెద్ద చెరువు గట్టు వద్ద గ్రామస్థాయి పోషకాహార మాసోత్సవ కార్యక్రమం సర్పంచి తాడిపర్తి ప్రియాంక అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ ముఖ్యంగా బాలామృతం, రాగి పిండితో చేసిన ఆహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ మరింత ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎ.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు నేలపాటి అరుణకుమారి, గొట్టుముక్కల శాంతి, జి.వెంకటలక్ష్మి, వివిఎస్ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఉండి : రాష్ట్ర ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ వాణి విజయరత్నం, కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మల్లికార్జునరావు అన్నారు. గురువారం కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి పోషణ మహా కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడారు. పోషకాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య నివారించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త డిబోరా మిస్సియానా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రత్నకుమారి, మేరీ, నాగలక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.

మాంటిస్సోరీలో రోటరీ ఇంటరాక్ట్ క్లబ్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్లో రోటరీ ఇంటరాక్ట్ క్లబ్‌ను నూతనంగా ప్రారంభించారు. రోటరీ క్లబ్‌కు అనుబంధంగా వివిధ సేవా కార్యక్రమాలు చేసే విధంగా ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ విద్యార్థులతో ఈ క్లబ్‌ను ప్రారంభించారు. మద్దాల సోదరులు ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. వారి విద్యార్థులతో కూడా సేవా కార్యక్రమాలు చేయించడానికి ముందుకు రావడం అభినందనీయమని రోటరీ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్‌రావు అన్నారు. యూత్ సర్వీస్ రీజనల్ ఛైర్మన్ మద్దాల వాసు మాట్లాడారు. అనంతరం రోటరీ ఇంటరాక్ట్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రోటరీ ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్‌గా కర్రి హరిహర నాగారెడ్డి, సెక్రెటరీగా కర్రి గౌసిక్‌వినయ్, ట్రెజరర్‌గా అనిశెట్టి తేజ హర్షిణిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, ట్రెజరర్ ముత్యాల ప్రదీప్, పాస్ట్ ప్రెసిడెంట్స్ పిబివి.సుబ్బరాజు, ముత్యాల శ్రీనివాస్, కటారి నాగేంద్ర కుమార్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు బొండాడ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - కాళ్ల

త్వరలో జరగనున్న జిల్లాస్థాయి టెన్నికాయిట్, త్రోబాల్ పోటీలకు బొండాల హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.రామ్మోహన్‌రావు గురువారం తెలిపారు. ఈ నెల 20న నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు శృంగవృక్షం హైస్కూల్లో నిర్వహించారు. వీరు అండర్-14, అండర్-17 బాల బాలికల విభాగంలో టెన్నికాయిట్, త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం పి.రామ్మోహన్‌రావు, పీడీ కె.విజయశ్రీ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వివి.గిరి కళాశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఆకివీడు: విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కోసం దాతలు ఆర్‌ఒ వాటర్ ప్లాంట్‌ను కళాశాలలో ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా లయన్స్ ఫస్ట్ వైస్ గవర్నర్ కాకర్ల వేణుబాబు అన్నారు. గురువారం ఆర్‌ఒ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. దీన్ని రూ.లక్షా 50 వేలతో ప్రారంభించామని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు, ఆదర్శ లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు గోరం కృష్ణమూర్తి చెప్పారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో లయన్స్ రిజర్వేషన్ ఛైర్మన్ రామరాజు సహకారంతో 20 మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత, ఆర్‌సి పల్లి రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి - మొగల్తూరు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25న విజయవాడలో సామూహిక ధర్నా చేపట్టనున్నామని సిడిపిఒ ఊర్మిలకు గురువారం అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 21వ తేదీ నుంచి రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ మినీ వర్కర్స్ హెల్పర్స్‌కు కనీస వేతనాలు చెల్లించాలని, తెలంగాణ కంటే అదనంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌శాడీలకు గ్రాడ్యూటీ అమలు చేయాలని కోరుతూ ధర్నా చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి జి.పెద్దింట్లు, ఎ.సీతారత్నం, సారమ్మ, పద్మావతి, జ్యోతి, మేరీ, ధనలక్ష్మి, జీవనకుమారి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ శాంతియుతంగా ఉండాలి

ప్రజాశక్తి - ఉండి

ప్రతి ఒక్కరూ శాంతియుతంగా ఉండాలని లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు లయిన్ గాదిరాజు రంగరాజు, లయన్ సత్తి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం ఎన్ఆర్‌పి అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శాంతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముక్కు వెంకట సత్యనారాయణ అధ్యక్షత వహించారు. లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు రంగరాజు, సత్తి బ్రహ్మారెడ్డి మాట్లాడారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. లయన్ రుద్రరాజు నరసరాజు ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామ పురవీధుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లయన్ పాలతీర్థపు నరసింహారావు, లయన్ భూపతిరాజు హరినాథ్ రాజు, లయన్ బొండాడ సూర్య బ్రహ్మానందం పాల్గొన్నారు.

పాలకొల్లు: పాలకొల్లు శ్రీఅద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాల స్వయం ప్రతిపత్తిలో అంతర్జాతీయ శాంతి దినోత్సవం డిపార్ట్మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్ ఇన్‌ఛార్జి టి.కృష్ణ, ఉషారాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు

గణపవరం : స్థానిక చాణిక్య కాలేజీలో గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శాంతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జోన్ పర్సన్ నాయకులు కె.సత్యనారాయణమూర్తి విద్యార్థులతో చేయించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు రావూరి నాగరాజు, ఎస్‌పికె.వర్మ, పి.రంగసాయి, వెల్లంకి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

డిఎన్ఆర్‌లో నాక్ బృందం

పాలకొల్లు : పాలకొల్లు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముగ్గురు సభ్యులతో కూడిన నాక్ కమిటీ మూల్యాంకనం గురువారం ముగిసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన వైస్ ఛాన్సలర్ దేవకి నందన్ గోస్వామి సారధ్యంలో కర్ణాటకకు చెందిన ప్రొఫెసర్ మీనాక్షి, తమిళనాడుకు చెందిన ప్రొఫెసర్ మైథిలి శ్రీనివాసన్ బృందం కళాశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, క్రీడా మైదానం, స్టాఫ్, స్టూడెంట్స్ గది, వివిధ రకాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తగిన సూచనలిచ్చారు. కళాశాల కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థినులు, ప్రస్తుత విద్యార్థినులు, తల్లిదండ్రుల కమిటీతో విడివిడిగా సమావేశం నిర్వహించి రిపోర్ట్‌ను ప్రిన్సిపల్‌కు అందజేశారు. వారంరోజుల తరువాత కవర్ తెరవాలని సూచించినట్లు ప్రిన్సిపల్ శోభారాణి తెలిపారు.

భారీ వర్షం.. పల్లపు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలో గురువారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి, చించినాడలోని అరుంధతీపేట, ఏనుగువానిలంకలో పాత హరిజనపేట, చింతదిబ్బ, కట్టుపాలెం గ్రామాల్లోని దళితపేట, బాడవ గ్రామంలో ప్రధాన రహదారులు వర్షపు నీటితో నిండిపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మొగల్తూరు : మండలంలో కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. స్థానికంగా ముక్కువారి వీధి, పోలీస్ స్టేషన్ రోడ్డు, సత్తెమ్మగుడి వీధిలో వర్షపు నీరు నిలిచిపోయింది.

నరసాపురం టౌన్: పట్టణంలో గురువారం కురిసిన భారీ వర్షానికి మెయిన్ రోడ్, అంబేద్కర్ సెంటర్, రాజరాజేశ్వరి థియేటర్ రోడ్, స్టీమర్ రోడ్ కూడళ్లలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

పాలకొల్లు: పాలకొల్లులో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో వినాయక మండపాలు వెలవెలబోయాయి. తెల్లవారుజామున, సాయంత్రం కూడా వర్షం కురిసింది. దీంతో రోడ్లు నీట మునిగి జనం, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

ఇంటింటా సర్వే వేగవంతం చేయాలి

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకోడేరు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఇంటింటా సర్వేను వేగవంతం చేయాలని డిఎంహెచ్ఒ మహేశ్వరరావు అన్నారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వారి బాగోగులను అడిగి వారికి రక్తపరీక్షలతోపాటు రక్తపోటు పరీక్షను నిర్వహించి తీరాలన్నారు. గొరగనమూడిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వేను ఆయన గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. అంగన్వాడీ, ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులకు ఐరన్ ట్యాబెట్లు అందిస్తున్నారా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఆయన వెంట ఎంపిహెచ్ఇఒ శ్రీనివాసమూర్తి, హెచ్.నాగమణి, హెల్త్ అసిస్టెంట్ ఎం.విజయప్రసాద్, సిబ్బంది రమోలా, మేరీలత, వేదకుమారి, సుజాత, శాంతి, కుమారి ఉన్నారు.

బాబా ఆలయం కిటకిట

కాళ్ల: కాళ్లలో సాయిబాబా మందిరం గురువారం యాత్రికులతో కిటకిటలాడింది. కాళ్ల గ్రామానికి చెందిన బండారు భోగేశ్వరరావు, సూర్యవతి దంపతుల కుమారుడు సోమేశ్వరరావు, శిరీష సుధ ఆర్థిక సహకారంతో అఖండ అన్న సమారాధన నిర్వహించారు.

యుటిఎఫ్ 50 ఏళ్ల స్వర్ణోత్సవాలు

రెండు ప్రచార జాతాలు : రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ స్థాపించి 50 ఏళు కావస్తోందని, ఈ నేపథ్యంలో నిర్వహించబోయే స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి పిలుపునిచ్చారు. యుటిఎఫ్ భీమవరం జిల్లా కార్యాలయంలో యుటిఎఫ్ 50వ ఏళ్ల స్వర్ణోత్సవాల ప్రచార యాత్ర పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ యుటిఎఫ్ 1974లో స్థాపించినట్లు తెలిపారు. 2024 నాటికి స్థాపించి 50 ఏళ్లు పూర్తవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకూ ప్రచార యాత్ర చేపట్టడం జరిగిందని, దీనిలో భాగంగా ఇచ్ఛాపురంలో ఈ ప్రచార యాత్ర ప్రారంభమైందని తెలిపారు. అనంతపురం జిల్లా హిందూపురం నుంచి విజయవాడ వరకూ రెండో ప్రచార యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. యుటిఎఫ్ 50 ఏళ్ల స్వర్ణోత్సవాల సందర్భంగా విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల అధ్యయనం కోసం ఈ రెండు ప్రచార జాతాలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటన చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రాథమిక విద్యారంగం, ప్రాథమిక పాఠశాలలకు మూసివేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రాథమిక విద్యారంగం బలోపేతానికి మేధావులతో చర్చించి చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఉపాధ్యాయులకు గొడ్డలిపెట్టుగా మారనున్న జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూడు నెలలుగా ఉపాధ్యాయ లోకం ఇప్పటికీ జీతాలు అందుకోలేని పరిస్థితిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే యుటిఎఫ్ 50 ఏళ్ల స్వర్ణోత్సవాల ప్రచార యాత్రలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయ రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, సహాధ్యక్షులు కె.రాజశేఖర్, సహాధ్యక్షురాలు కె.శ్రీదేవి, జిల్లా కోశాధికారి సిహెచ్ పట్టాభి రామయ్య, జిల్లా కార్యదర్శులు కెఎస్ రామకృష్ణప్రసాద్, జి.రామ కృష్ణరాజు, పి.క్రాంతి, డి.ఏసుబాబు, జి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

9వ రోజుకు టిడిపి రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - ఆచంట


ఆచంటలో నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

చంద్రబాబు అక్రమ అరెస్టు దారుణమని జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు అన్నారు. ఆచంటలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో పితాని వెంకట్, కేతా మీరయ్య, బీరా నరసింహమూర్తి, బోడపాటి దుర్గాప్రసాద్, కేతా మురళి పాల్గొన్నారు.

పాలకొల్లు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో వద్ద టిడిపి శ్రేణులు చేస్తున్న దీక్షలు 9వ రోజుకు చేరాయి. టిడిపి బిసి నేతలు వర్షాన్ని సైతం లెక్కజేయకుండా దీక్షల్లో పాల్గొన్నారు. బిసి నేతలు కర్నేన గౌరు నాయుడు, కడలి గోపి, కర్నేన రోజారమణి, జివి, మామిడిశెట్టి పెద్దిరాజు, అంగర చిన్ని పాల్గొన్నారు.

మొగల్తూరు : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ముత్యాలపల్లిలో టిడిపి నేతలు పోస్టు కార్డులతో ప్రదర్శన చేశారు. అనంతరం సమీపంలోని తపాలా బాక్స్‌లో కార్డులు వేశారు. కార్యక్రమంలో నాయకులు కొల్లాటి బాలకృష్ణ, నాగిడి రాంబాబు, దొంగ స్వామి, కొల్లాటి మూలస్వామి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ గొర్రెల సూరన్న కాంప్లెక్స్ వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షలు తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. తాడేపల్లిగూడెం టౌన్, తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు మండలాల మహిళా కార్యకర్తలు దీక్షలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి మాట్లాడారు.

ఉండి : చంద్రబాబుకు అండగా మేము సైతం అంటూ నియోజకవర్గ తెలుగు మహిళలు తొమ్మిదో రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కన్నెగంటి రూత్ కళ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు జిల్లా మహిళా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడారు. దీక్షలో కూర్చున్న మహిళలకు ఎంఎల్ఎ మంతెన రామరాజు సతీమణి సుష్మ రామరాజు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, మండల మహిళ అధ్యక్షురాలు వత్సవాయి నాగ వెంకట సుజాత పాల్గొన్నారు.

గొల్లలకోడేరు పంచాయతీలో గ్రూపుల పోరుకు తెర

ఐక్యతతో అభివృద్ధి దిశగా అడుగులు

ప్రజాశక్తి - పాలకోడేరు


వైసిపి ముఖ్య నేత రాజా నరేంద్రవర్మతో వార్డు సభ్యులు

గొల్లలకోడేరు పంచాయతీలో గ్రూపుల పోరుకు ఎట్టకేలకు ఫుల్‌స్టాప్ పడింది. ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని భావించిన పాలకవర్గ సభ్యులు ఆ విధంగా అడుగులు ముందుకు వేసేందుకు గురువారం తొలి అడుగు వేశారు. పంచాయతీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గ్రూపుల మధ్య పోరు జరుగుతోంది. వార్డు మెంబర్లు రెండు గ్రూపులుగా చీలిపోవడంతో గ్రామాభివృద్ధికి అనేక ఆటంకాలు ఏర్పడడంతో గ్రామాభివృద్ధి మందగించింది. పంచాయతీ సమావేశాల్లో అభివృద్ధి పనులకు తీర్మానం చేయాలన్నా, ముందుకు సాగే పరిస్థితి ఉండేది కాదు. దీంతో అధికారులకు గ్రూపుల పోరు తలనొప్పిగా పరిణమించింది. అయితే ఇటీవల ఒక వార్డుకు ఉప ఎన్నిక జరిగిన నేపథ్యంలో ఒక గ్రూపు అభ్యర్థి విజయం సాధించడంతో పరిస్థితులు చక్కబడ్డాయి. మొత్తం 12 మంది వార్డు సభ్యులుండగా ఏడుగురు వార్డు సభ్యులు ఒక గ్రూపులో ఉన్నా, అయిదుగురు సభ్యులు మారో గ్రూపులో ఉన్నారు. ఇదిలా ఉండగా గురువారం పంచాయతీ పాలకవర్గ సమావేశం జరిగింది. ఒక వర్గానికి చెందిన ముగ్గురు సభ్యులు పంచాయతీ సమావేశానికి గైర్హాజరు కాగా మిగిలిన ఇద్దరు సభ్యులు హాజరయ్యారు. అయితే మరొక వర్గానికి చెందిన ఏడుగురు వార్డు సభ్యులకు మెజార్టీ ఉండడంతో గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి, ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. ఎట్టకేలకు పంచాయతీ పాలకవర్గ సమావేశం ప్రశాంతంగా జరగడంతో పంచాయతీ అధికారులతో పాటు మిగిలిన అధికారులు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే పంచాయతీ పాలకవర్గం వర్గ పోరు రానున్న రోజుల్లో ఏవిధంగా దారి తీస్తుందోనని సర్వత్రా చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే రానున్న రోజుల్లో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు మెజార్టీ పాలకవర్గ సభ్యులు యోచిస్తున్నట్లు సమాచారం.

ప్రజారోగ్య సంరక్షణే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

ప్రజాశక్తి - ఆచంట

వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు, అవసరాలు తెలుసుకొని పరిష్కరించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారాం అన్నారు. కొడమంచిలిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం సీతారామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారని, రాష్ట్రంలోని ఆసుపత్రులను ఆధునీకరించి వైద్య సేవలను మెరుగుపర్చారన్నారు. కొడమంచిలిలో అక్టోబర్ 6, 7వ తేదీల్లో వైద్య శిబిరాల్లో పరీక్షలు చేసి అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ, సచివాలయం సిబ్బంది, సచివాలయం కార్యదర్శి గోవర్ధన్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ ఎం.కృష్ణమోహన్ సూచించారు. పట్టణంలోని రెండో సచివాలయం పరిధిలో ఆయన ఆశా వర్కర్లతో కలిసి సురక్ష పథకాన్ని ఇంటింటికీ ప్రచారం చేశారు. పలుచోట్ల వారి నుంచి శాంపిల్స్ సేకరించారు.

కొనసాగిన ఎంఆర్‌పిఎస్ రిలే దీక్షలు

ప్రజాశక్తి - ఆచంట

బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన 100 రోజుల్లో ఎస్‌సి వర్గీకరణ చేస్తామని మాటిచ్చి తొమ్మిదేళ్లు కావస్తున్నా వర్గీకరణ బిల్లు చేయకపోవడం బాధాకరమని ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తొత్తరమూడి శ్రీనివాస్ అన్నారు. ఆచంట నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ఎంఆర్‌పిఎస్ రిలే నిరాహార దీక్షలు గురువారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29 సంవత్సరాలుగా ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటంలో వర్గీకరణ విషయంలో జాప్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు చదలవాడ మాణిక్యాలరావు, సురేష్, కుందుర్తి చిరంజీవి, ముప్పిడి శ్రీనివాస్, సవరపు తాతాజీ, పల్లేటి సుధాకర్ సవరపు సురేష్, కనపాల పెద్దిరాజు పాల్గొన్నారు.